క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: అక్షర నిర్మాన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన బాల శిక్ష స్పెల్–బీ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈమేరకు విద్యార్థులు డి.లక్ష్మీదుర్గ, సీహెచ్.సహస్ర, తన్మయ్‌శ్రీజ, తేజస్విని, జశ్విత, జననీప్రియ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు తెలిపారు.

తూకంలో మోసాలపై ఫిర్యాదు

మధిర: మండలంలోని ఒక కోల్డ్ స్టోరేజ్‌లో రెండు రోజుల క్రితం తూకంలో తేడాలు వచ్చాయని ఆరోపిస్తూ నక్కలగరువు గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు సోమవారం మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న కాంటాను పరిశీలించాలని తూనికలు కొలతల శాఖ అధికారికి మధిర టౌన్ పోలీసులు సూచించారు. ఈ విషయంపై కోల్డ్ స్టోరేజ్ అసోసియేషన్ అధ్యక్షుడు మందడపు రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుతం అన్‌సీజన్ కొనసాగుతుందని, రైతుల వద్ద నుంచి కొనుగోలు ప్రక్రియ చేయడం లేదని తెలిపారు. ఈ మిర్చి కొనుగోలుకు సంబంధించి కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యానికి ఎటువంటి సంబంధం లేదని వారు తెలిపారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందిని సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ నాగమణి, ఉపసర్పంచ్ వినోద, ఎంపీటీసీ సభ్యురాలు నాగరత్నం, సరోజిని, వెంకటేశ్వర్లు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని కిష్టారం అంబేడ్కర్‌నగర్‌లో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణా శిబిరాన్ని సోమవారం కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు జక్కం వాణి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టైలరింగ్‌తో పాటు బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ కోర్సులు, మగ్గం వర్క్ కూడా సింగరేణి సేవా సమితి ద్వారా శిక్షణ పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాముండేశ్వరి నర్సింహారావు, ఎంపీటీసీ సభ్యురాలు సునీత రాజు, సర్పంచ్ రేణుక, ఈశ్వర్, మురళీకృష్ణారావు, ప్రహర్షిత సందీప్, సుధాకర్, సాగర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

మధిర: సిరిపురం గ్రామం సమీపంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. మాటూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో ఇటుక బట్టీల కూలీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దగ్గుతో బాధపడుతున్న వారికి కళ్లె పరీక్షల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి కి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు వూటుకూరు భాస్కర్‌రావు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు వైద్య శిబిరాలు

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరం, జమలాపురం గ్రామాల్లో సోమవారం కంటి వెలుగు శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో 352 మందికి వైద్యులు రవిరాజ్, సాయికిరణ్‌లు కంటి పరీక్షలు చేసి అందులో 52 మందికి కళ్ల అద్దాలను అందజేశారు. 19 మందిని ఆపరేషన్ నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లిక, హెచ్‌ఈఓ సదాశివరావు, సూపర్‌వైజర్‌లు పద్మావతి, వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సాయిరెడ్డి, ఏఎన్‌ఎంలు రత్నమాల, నాగమణి, రాణి, రత్నమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

22 నుంచి జీవాలకు నట్టలమందు పంపిణీ

కారేపల్లి: మండలంలో ఈ నెల 22 నుంచి మార్చి 2 వరకు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేయడం జరుగుతుందని మండల పశువైద్యాధికారి ఉపేందర్ తెలిపారు. నాలుగు బృందాలుగా ఏర్పడి మండలంలోని గ్రామాలలో నిర్దేశించిన తేదీల్లో నట్టల మందును పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని జీవాల యజమానులు వినియోగించుకోవాలని కోరారు.

అక్రమ ఇటుక బట్టీలు

- రెవెన్యూ అధికారుల అండతో ఇష్టారాజ్యం
- కన్నెత్తి చూడని కార్మిక, మైనింగ్ శాఖలు
- ఇష్టారాజ్యంగా చెట్లు నరుకుతున్నా అటవీ శాఖకు పట్టని వైనం



కే.జీ.మల్లెల సమీపాన కొనసాగుతున్న ఇటుక బట్టీ

వేంసూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఇటుక బట్టీల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఏ ప్రభుత్వ శాఖ నుంచి కూడా అధికారికంగా అనుమతి తీసుకోకుండానే ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో సహజ వనరులను కొల్లగొట్టి అక్రమంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. అక్రమార్కులకు రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖల ఉద్యోగులు అండగా నిలుస్తుండడంతో రూ.ఏటా కోట్ల వ్యాపారం జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. సహజ వనరులైన మట్టి, కలప, నీటిని పరిరక్షించాల్సిన రెవెన్యూ, భూగర్భ గనుల(మైనింగ్) శాఖల అధికారులు వ్యాపారుల నుంచి మామూళ్లు పుచ్చుకుంటూ ప్రకృతి విధ్వంసానికి కారకులవుతున్నారని పర్యావరణ వేత్తలు, స్థానికులు విమర్శిస్తున్నారు.

నిబంధనలు పట్టించుకోకుండా..

ఇటుక బట్టీలను నిర్వహించాలంటే రెవెన్యూ, భూగర్భ, గనులు,వి ద్యుత్, కార్మిక తదితర శాఖల నుంచి అనుమతులు పొందాలి. సాగుకు యోగ్యం కాని భూముల్లో మాత్రమే ఇటుక బట్టీ ఏర్పాటుచేయాలి. సాగు భూములు, అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో నిర్వహించేందుకు వీలు లేదు. అలాగే, వాణిజ్య విద్యుత్ మాత్రమే వాడాల్సి ఉంటుంది. మట్టిని తవ్వి తీసేందుకు భూగర్భ గనుల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. ఇక ఇటుకలను కాల్చడానికి కలప, ఊకపొట్టు, బొగ్గు ఏది వాడిన అందుకు సంబంధించిన ఆధారాలు ఇటుక వ్యాపారుల వద్ద ఉండాల్సి ఉన్నా అవేమీ ఇక్కడ అమలు కావడంలేదు.

వ్యవసాయ భూములు.. ఉచిత కరెంట్

ఈ ప్రాంతంలోని కొందరు రైతుల వద్ద వ్యాపారులు భూములు లీజ్‌కు తీసుకుని ఎలాంటి అనుమతి లేకుండా ఇటుక బట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రైతు బంధు సాయం పొందుతున్న కొందరు వ్యాపారులకు భూములను లీజ్‌కు ఇస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అలాగే, వ్యవసాయానికి ఉచితంగా ఇచ్చే విద్యుత్‌ను ఇటుక బట్టీల నిర్వహణకు వినియోగిస్తున్నారు. ఈ విషయం తెలిసినా విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ చేయకపోవడం గమనార్హం.

స్థానికేతరులతో నిర్వహణ..

ఇటుక బట్టీల్లో చేయడానికి వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను కుటుంబాలతో సహా పిలిపిస్తున్నారు. కూలీలను తెచ్చుకునే విషయంలో దళారులు కీలకపాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఇద్దరికి ఆరు నెలల కాలానికి గాను రూ.50 వేల నుంచి రూ.90 వేల వరకు ఇస్తారని తెలుస్తోంది. కార్మిక శాఖ నిబంధనల ప్రకారం బట్టీల్లో పని చేసే కార్మికులకు గుర్తింపు కార్డులు ఉండడమే కాక కనీస వేతనం, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. కార్మికుల పిల్లల చదువుకు ప్రత్యేక చొరవ చూపాలి. కానీ బట్టీల్లో కార్మికులకు నిర్వాహకులు అంతంత మాత్రంగానే సౌకర్యాలు కల్పిస్తూ, ప్రకృతి సహజ వనరులను విధ్వంసం చేస్తున్నా ఏ శాఖ అధికారులు కూడా పట్టించుకోకపోవడం వెనుక కారణాలు అంతుపట్టడం లేదు.

చర్యలు తీసుకోవాలి



పర్యవరణానికి విఘతం కలిగించే విధంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇటిక బట్టీలపై అధికారులు చర్యలు తీసుకోవాలి. అదే విధంగా చెరువుల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కూడా అధికారులు దృష్టి సారించాలి. ప్రధాన రహదారుల పక్కన బట్టీలు నిర్వహించడం వలన ప్రయాణికులు ఇబ్బందులకు గురౌతున్నారు. కావున అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– పర్సా రాంబాబు, మర్లపాడు

కేంద్ర విధానాలపై పోరుకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

చింతకాని: ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పోరుకు సిద్ధం కావాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నున్నా నాగేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు కనీస మద్దతు ధర లభించటం లేదని ఉపాధిహామీ, ఆహార భద్రత, కనీస వేతనాలు లేకుండా పోతున్నాయన్నారు. వ్యవసాయ చట్టాలపై దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమంలో వ్యవసాయ కార్మికులు కూడా కలిసి రావటంతో ఉద్యమం తీవ్రమై కేంద్రం దిగొచ్చిందన్నారు. బడ్జెట్‌లో ఉపాధిహామీ పథకానికి రూ.30 వేల కోట్లు తగ్గించి రైతులకు, వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. కావున కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, మండల కార్యదర్శి వెంకటనర్సయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు గోపాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జానికిరాములు, సీఐటీయూ మండల కన్వీనర్ రమణ, రైతు సంఘం మండల అధ్యక్షుడు బసవయ్య, నాయకులు రవి, కృష్ణమూర్తి, వీరయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

వైరా/కారేపల్లి: వైరా మున్సిపాలిటీ పరిధిలో గల ప్రభుత్వ హైస్కూల్, మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు, కారేపల్లి మండలంలోని ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోమట్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం శ్రీ బాలాజీ ఎస్టేట్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసి మోటివేషన్ తరగతులను నిర్వహించారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవ్వకుండా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపన్యాసకుడు ఎం.శ్రీనివాసరావు, హెచ్‌ఎం ప్రేమ్‌సాగర్, ఇంపాక్ట్ మోటివేటర్ నాగభూషణం, హెచ్‌ఎంలు చావా శ్రీనివాసరావు, రంగారెడ్డి, ఎండీ. ఆశా, షేక్. ఖాదర్, అజీజ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైరా: విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



ఎర్రుపాలెం: మాట్లాడుతున్న సాంబశివరావు

వేంసూరు/ఎర్రుపాలెం/తల్లాడ: పేద ప్రజల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని బీజేపీ జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా అన్నారు. సోమవారం మండలంలోని వెంకటపురంలో ప్రజా గోస – బీజేపీ భరోసా యాత్రలో భాగంగా.. ఉపాధిహామీ కూలీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అలాగే ఎర్రుపాలెం మండలంలో నిర్వహించిన సమావేశంలో కేంద్ర పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావులు కోరారు. అలాగే రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తల్లాడ మండలం తెలగారం గ్రామంలో గొల్లమందల నరేష్ అధ్యక్షతన జరిగిన బీజేపీ భరోసా కార్యక్రమంలో బీజేపీ తల్లాడ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో అవినీతి రహిత పాలన అందిస్తుందని, తెలంగాణాలో కూడా బీజేపీ అవినీతి రహిత పాలన అందించేందుకు కంకణ బద్ధులై ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయుడు రాఘవరావు, పార్టీ మండల అధ్యక్షుడు పర్సా రాంబాబు, మట్టా ప్రసాద్, పాల నాగసురేంద్ర రెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు ముక్కపాటి శ్రీనివాసరావు, నాయకులు దేవరకొండ కోటేశ్వరరావు, చంద్రమౌళేశ్వరరావు, మిర్యాల నాగేశ్వరరావు, మల్లెల మోహన్‌రావు, వేమా ఏడుకొండలు, మిర్యాల వెంకటేశ్వరరావు, బొల్లయ్య, బీజేపీ మండల కార్యదర్శి గాదె కృష్ణారావు, నాయకులు కృష్ణ, రాయల రమేష్, నాగేశ్వరరావు, నరసింహారావు, రామారావు, శారద తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ముదిగొండ: ముదిగొండలో సోమవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు పంపిణీ చేశారు. మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క సిఫారస్ మేరకు గ్రామంలోని నాగయ్య, రజనీలకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీను, నాయకులు శ్రీనివాస్, ఉపేందర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలో సోమవారం రాజులదేవరపాడు, చొప్పకట్లపాలెం, మీనవోలు గ్రామాలకు చెందిన పలువురికి లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి రూ.10,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ, నాయకులు నర్సింహారావు, జానీబాషా, కృష్ణారావు, అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎర్రుపాలెం: మీనవోలులో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

కొణిజర్ల: మండలంలో ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా సోమవారం పెద్దగోపతి గ్రామానికి చెందిన అబ్దుల్‌నబీ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందగా పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో రూ.2 లక్షల బీమా చెక్కును మృతుని భార్యకు అందజేశారు. మండలంలోని బోడియాతండాలో వివిధ కారణాలతో చికిత్స పొందుతున్న పలు కుటుంబాల వారిని పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కవిత, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చిరంజీవి, సుడా డైరెక్టర్ కృష్ణ, సొసైటీ చైర్మన్ రవి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

కొణిజర్ల: మండల కేంద్రం కొణిజర్లకు చెందిన టీడీపీ కార్యకర్త రేగళ్ల శ్రీను సోమవారం మృతి చెందాడు. ఆయన గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీను మృతికి టీడీపీ మండలాధ్యక్షుడు తాతా సుధాకర్‌రావు, నాయకులు దామా శ్రీనివాసరావు, చింతల రాంబాబు, సామినేని శ్రీనివాసరావు, బందారు వెంకన్న, సురేష్, వెంకయ్య, ఆంజనేయులు నరసయ్య, సత్యనారాయణ తదితరులు సంతాపం ప్రకటించి మృతదేహంపై టీడీపీ జెండా కప్పి నివాళులు అర్పించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తల్లాడ: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మల్లవరం రైతు వేదికలో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఎంపీఓ కొండపల్లి శ్రీదేవి, డీఆర్డీఏ రిసోర్స్ పర్సన్లు అనూష్, లాలయ్య, జక్రయ్య పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌టీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో

ఏన్కూరు: వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల అక్రమ అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలో వైఎస్‌ఆర్‌టీపీ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్‌టీపీ వైరా నియోజకవర్గ కోఆర్డినేటర్ ధర్మసోతు రామ్‌నాయక్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో విఫలం అయిందన్నారు. పాదయాత్ర చేస్తున్న షర్మిలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యరమల మాధవరెడ్డి, బొడ నర్సింహా లాల్, రేళ్ల సుజాత, తరుణ్‌రెడ్డి, శ్రీకాంత్, వెంకటరాజు, మాధవరెడ్డి, భాస్కర్, సూర్యం, సైదులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి.. పేదింటి ఆడబిడ్డలకు వరం



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న భట్టి విక్రమార్క, కమల్‌రాజ్

బోనకల్: కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డల పాలిట వరమని సీఎల్పీనేత మల్లు భట్టి విక్రమార్క, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో 92 మంది లబ్ధిదారులకు వారు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. అనంతరం భట్టి మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ హయాంలో అమలుచేసిన బంగారులక్ష్మి పథకం ద్వారా విడతల వారీగా ఒక్కొక్కరికి రూ 2.50 లక్షల వరకు లబ్ధి చేకూరేదని, తద్వారా బాల్యవివాహాలకు అడ్డుకట్ట పడిందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టగా, ఎక్కువ మందికి లబ్ధి చేకూరేలా విస్తరింప చేయాలన్నారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మాట్లాడుతూ ఈ పథకం దేశానికే ఆదర్శమని చెప్పారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్వేత, జెడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, ఎంపీడీఓ వేణు మాధవ్, ఎంపీపీ కంకణాల సౌభాగ్యం తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరుతూ జర్నలిస్టులు మండల కేంద్రానికి వచ్చిన సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌కు వినతిపత్రాలు అందజేశారు. జర్నలిస్టులు సురభి వెంకన్న, తేనె వెంకటేశ్వర్లు, రేగళ్ల శ్రీను, యార్లగడ్డ శ్రీను, తమ్మారపు బ్రహ్మం, పారా శ్రీను, తమ్మారపు వెంకటేశ్వర్లు, సత్యానందం, బడే, యాలాద్రి, సాహెబ్ పాల్గొన్నారు.

త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పట్టాలు



టీయూడబ్ల్యూజే సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి మండల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పట్టాలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వెల్లడించారు. పట్టణంలో సోమవారం జరిగిన టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) డివిజన్ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో పెనుబల్లి పర్యటనకు రానున్న మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా పెనుబల్లి మండల జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. ఆతర్వాత మిగతా మండలాల్లోనూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా పదిహేనేళ్ల పైబడి పనిచేస్తున్న జర్నలిస్టులను సన్మానించారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆత్మకమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఎంపీపీలు దొడ్డా హైమావతి, పగుట్ల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు చెక్కిలాల మోహన్‌రావు, దిరిశాల ప్రమీలతో పాటు తోట సుజలరాణి, తోట కిరణ్, పట్టికొండ రవి, దుగ్గిదేవర అజయ్‌కుమార్, పబిలిశెట్టి రామారావు, జమ్ముల రాజేష్‌రెడ్డి, రామిశెట్టి రమేష్, బొల్లిపోగు సురేష్, నర్రా అరుణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల గ్రామంలో నూతనంగా రూ.48.3 లక్షలతో మంజూరైన సీసీరోడ్ల నిర్మాణానికి, రూ.25 లక్షలతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం సింగరేణి వారి సౌజన్యంతో గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామంలో రూ.కోటితో నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామానికి చెందిన గొర్ల వెంకటరెడ్డి గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఎనిమిది కుటుంబాల సభ్యులకు రూ.5వేలు చొప్పున ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా హైమావతి, సర్పంచ్ జక్కుల ప్రభాకర్, దొడ్డా శంకర్‌రావు, నాగిరెడ్డి, ఎర్రబాబు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం..

పెనుబల్లి: మండలంలోని ఇటీవల జరిగిన మండాలపాడు గ్రామానికి చెందిన కర్రీ రామారావు, పద్మావతి దంపతుల కుమార్తె అఖిల – సీతారామ ప్రసాద్ దంపతుల వివాహానికి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కనగాల వెంకట్రావు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సేవాలాల్ సేన నాయకులు

కల్లూరు: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు జాటోత్ ఠానూనాయక్ విగ్రహాన్ని ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని సేవాలాల్ సేన నాయకుడు బానోత్ కిషన్ తెలిపారు. ఈ మేరకు కల్లూరులో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని తృణపాయంగా అర్పించిన ఠానూనాయక్ సాయుధ పోరాట యోధుల్లో ఒకరిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్యా శివనాయక్, కొర్రా నరసింహా నాయక్, మాలోత్ హుస్సేన్‌నాయక్, రవీంద్ర, అరవింద్, బాలాజీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన పౌరాణిక నాటకాలు

మధిర: శివరాత్రి జాతరను పురస్కరించుకొని మధిర పట్టణంలోని శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయంలో జరుగుతున్న పౌరాణిక పద్య నాటకాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం రాత్రి మాటూరుపేట శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రాయబారం (పడక సీన్) గయోపాఖ్యానం (వార్ సీన్) అలరించాయి. ఈ నాటకాలను రంగస్థలం కళాకారుల సమాఖ్య అధ్యక్షులు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్ పర్యవేక్షించగా గద్దం సుబ్బారావు దర్శకత్వం వహించి నటించారు.

ఆటో స్టార్టర్ల తొలగింపు నిర్ణయాన్ని విరమించుకోవాలి

కొణిజర్ల: వ్యవసాయ విద్యుత్ మోటర్లకు ఆటో స్టార్టర్ల తొలగింపు నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొణిజర్ల ట్రాన్స్‌కో సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా రైతులు ఆటో స్టార్టర్లతో వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రైతులు వినియోగించుకోవడం నేరమా అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతనిప్పు చలపతిరావు, కొప్పుల కృష్ణయ్య, చెరుకుమల్లి కుటుంబారావు, దారగాని రాములు, యరమల మాధవరెడ్డి, మోత్కూరి వెంకయ్య, తాతా వెంకయ్య, అన్నారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్ల సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా వంతెన



కొణిజర్ల మండలం తనికెళ్ల, బోడియా తండా గ్రామాల మధ్య ఎన్నెస్పీ ప్రధాన కాల్వ మీద నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని పక్కన ఉన్న గోడ పూర్తిగా కూలిపోయింది. దీంతో అది అత్యంత ప్రమాదకరంగా తయారైంది. నిత్యం వందలాది మంది ఈ బ్రిడ్జి మీద నుంచి ప్రయాణం చేస్తుంటారు. ఈ క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే.. వాహనదారులు కాల్వలో పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి బ్రిడ్జిపై రక్షణ గోడను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– కొణిజర్ల

ప్రశ్నించాల్సిన అధికారి : వై.రమేష్, ఏఈ పంచాయతీరాజ్

సెల్ నంబర్ : 9440584619